క్లుప్తంగా

శేష వాహనంపై శ్రీనివాసుడు



శేషవాహనంపై శ్రీవారి తిరువీధి ఉత్సవం నిర్వహిస్తున్న నిర్వాహకులు

బద్వేలు అర్బన్ : స్థానిక సిద్దవటంరోడ్డులోని ఫైర్ ఆఫీసు వెనుకభాగంలో ఉన్న శ్రీమహాలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ దశమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారిని శేష వాహనంపై కొలువుదీర్చి తిరువీధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. దారి పొడవునా భక్తులు స్వామివారికి నీరు వారపోసి కాయకర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. ఉదయం నుంచి ఆలయంలో ధ్వజారోహణం, మహాకుంభ ఆరాధన, చతుస్థానార్చన వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు వల్లంకొండు వెంకటరమణ, సెక్రటరీ అంకయ్య, ఆలయ ప్రధాన అర్చకులు వీరేశాచార్యులు, సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రి తనిఖీ



శానిటేషన్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి గురువారం జిల్లా ఆస్పత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. ఓపీలోని ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఓపీ విభాగాలను పరిశీలించి అక్కడి వైద్యులతో మాట్లాడారు. సకాలంలో ఆస్పత్రికి వస్తూ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని చెప్పారు. పేదలు, మధ్య తరగతి ప్రజలే ప్రభుత్వ ఆస్పత్రికి వస్తారని వారితో ప్రేమగా మాట్లాడాలన్నారు. మంచి వైద్యాన్ని అందించి ప్రభుత్వ హాస్పిటళ్లపై ప్రజలకు నమ్మకం కలిగించాలన్నారు. హాస్పిటల్‌లోని సమస్యలపై హాస్పిటల్ సూపరింటెండెంట్ శ్రీవాణిని అడిగి తెలుసుకున్నారు. రోగుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని, ఎవరైనా డబ్బులు అడిగితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఎమ్మెల్యే వెంట హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సభ్యుడు బద్వేలి శ్రీనివాసులరెడ్డి ఉన్నారు.

మున్సిపల్ ఏఈగా నిరంజన్‌రెడ్డి



ఏఈ నిరంజన్‌రెడ్డి

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీ అసిస్టెంట్ ఇంజినీర్‌గా నిరంజన్‌రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో మైదుకూరు మున్సిపల్ ఏఈగా ఆయన పని చేశారు. పాలకవర్గ సమావేశంలో ఏఈకి వ్యతిరేకంగా తీర్మానం చేయడంతో బదిలీపై సొంత శాఖ పంచాయతీ రాజ్‌కు వెళ్లారు. ప్రస్తుతం కమలాపురం పంచాయతీరాజ్ కార్యాలయం నుంచి తిరిగి మైదుకూరు మున్సిపాలిటీకి బదిలీపై వచ్చారు.

ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ నిధులు విడుదల చేయాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ నిధులను విడుదల చేయాలని దళిత సైన్యం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆశీర్వాదం కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం దళిత సైన్యం జిల్లా నూతన కమిటీని ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక కారణాల వల్ల తల్లికి వందనం పథకం డబ్బులు తల్లుల ఖాతాలకు జమ కాలేదని తెలిపారు. ఈ సమస్యను ప్రభుత్వం పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు. దళిత సైన్యం జిల్లా అధ్యక్షుడిగా గాలిపోతుల క్రిస్టఫర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఓబులేసు, నియోజకవర్గ అధ్యక్షుడిగా రాజు, మండల అధ్యక్షుడిగా సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా గురవయ్యలను నియమించారు.

గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన

కలసపాడు : స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం ఎస్‌ఐ తిమోతి విద్యార్థినులకు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి స్పర్శ అంటే ఇష్టమై, సురక్షితమైన స్పర్శ అని, చెడు స్పర్శ అంటే భయం కలిగించే అసౌకర్యంగా అనిపించే స్పర్శ అన్నారు. ఎవరి శరీరాలు వారి సొంతమని, వాటిని తాకే హక్కు వారికి మాత్రమే ఉంటుందన్నారు. ఎవరికైనా అసౌకర్యంగా అనిపిస్తే వద్దు అని చెప్పండి, వద్దు అని చెప్పినప్పటికీ ఎవరైనా తాకితే పెద్దలకు చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంత జీవనం సాగించండి

రాజుపాళెం : గ్రామాల్లో ఎటువంటి గొడవలు చేసుకోకుండా ప్రశాంతంగా జీవించాలని ప్రొద్దుటూరు రూరల్ సీఐ బాల మద్దిలేటి సూచించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని పగిడాలలో గురువారం రాత్రి కళా జాగృతి మేలుకొలుపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఫ్యాక్షన్ జోన్ సీఐ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ చిన్నచిన్న సమస్యలను పెద్దవిగా చేసుకొని గొడవలు సృష్టిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఎస్‌ఐ సిద్దయ్య, హెడ్ కానిస్టేబుల్ నర్సారాం, పోలీసులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనం అరకొర

కేసీ కెనాల్ ఆయకట్టు పరిధిలో అత్యధికంగా వరి సాగు చేసే మైదుకూరు నియోజకవర్గంలోని రైతులకు పచ్చిరొట్ట ఎరువు కొరత వేధిస్తోంది. ఖరీఫ్ సీజన్ కంటే ముందే ప్రభుత్వం రైతుకు విత్తనం అందించాల్సి ఉండగా.. వచ్చిన అరకొర విత్తనం రైతులకు అందని పరిస్థితి. డబ్బు చెల్లించిన రైతులు విత్తంన అందక దిగాలు పడుతున్నారు.

ప్రభుత్వం ఇస్తుందని రైతుల ఎదురుచూపు



జీలుగ పంట

ఖాజీపేట : 2025 ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం పచ్చిరొట్ట విత్తనాలు రైతులకు అందించే ప్రయత్నం మొదలుపెట్టినా రైతులకు సరిపడడం లేదు. దీంతో విత్తన కొరత ఏర్పడి బ్లాక్ మార్కెట్‌లో ఎక్కువ డబ్బు చెల్లించి రైతులు కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది. ఖాజీపేట మండలంలో గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 8 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. ఒక ఎకరాకు జీలుగ లేదాజనుము గానీ పది కిలోలు కావాల్సి ఉంటుంది. ఖరీఫ్ సీజన్‌లోనే 800 క్వింటాళ్లకు పైగా రైతులకు అవసరం ఉంది. అధికారులు 30 క్వింటాళ్ల జీలుగ, 150 క్వింటాళ్ల జనుము మంజూరు చేశారు. ఇది రైతుకు ఎంతకీ సరిపోవడం లేదు.

సాగుకు సిద్ధమవుతున్న రైతులు

ఖరీఫ్ సీజన్ కంటే ముందే రైతులు పచ్చిరొట్టి విత్తనాలు సాగు చేస్తారు. జీలుగ, జనుము సాగుకు 40 రోజుల సమయం పడుతుంది. జూన్, జులై నెలలో అధికంగా సాగు చేస్తారు. ఈ విత్తనాలు సాగు చేసిన పది రోజులకు నారు పోస్తారు. ముందే జనుము, జీలుగ పంట పొలంలోనే తొక్కించేసి నారు తీసి వరి సాగు చేస్తారు. దీంతో జూన్‌లోనే రైతులకు పచ్చిరొట్ట విత్తనం అందిస్తే జులై లేదా అగస్టులో సాగు చేసుకునే వీలుటుంది.

విత్తనాల కొరత

ఖరీఫ్ సీజన్‌లో రైతులు అధికంగా జీలుగ సాగు చేస్తారు. అధిక వర్షం వచ్చినా పంట దెబ్బతినే అవకాశం ఉండదు. జనుము అధిక వర్షాలకు తట్టుకునే అవకాశం లేదు. జీలుగ, జనుము సాగుతో వచ్చే పోషకాలు ఒకే రకంగా ఉంటాయని, రైతులు ఏది వాడినా ప్రయోజనం ఉంటుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. దీంతో రైతులు ఈ విత్తనాల కోసం రైతు భరోసా కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. రైతు అవసరాలను దృష్టిలో పెట్టుకొని రైతుకు కావాల్సిన విత్తనం సకాలంలో అందించడంలో ఏపీసీడ్ అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలున్నాయి. అవసరాలకు అనుగుణంగా విత్తనాలను కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం చేసినట్లు తెలుస్తోంది.

2025 ఖరీఫ్ సీజన్‌లో మైదుకూరు నియోజకవర్గానికి మంజూరైన విత్తనం వివరాలు క్వింటాళ్లలో

మండలం	ఆయకట్టు (హెక్టార్లలో)	జీలుగలు	జనుములు	పిల్లపెసర
		(క్వింటాళ్లలో)		
చాపాడు	5282	250	650	7
దువ్వూరు	2999	100	250	3
మైదుకూరు	1225	75	175	3
ఖాజీపేట	3340	30	150	0
బి.మఠం	1498	75	100	3

కరవు మండలంగా ప్రకటించినా..

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మైదుకూరు నియోజకవర్గంలోని అన్ని మండలాలను కరవు మండలాలుగా ప్రకటించింది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. అయితే రైతులకు ఎలాంటి ప్రయోజనం కనిపించడం లేదు. విత్తనం పూర్తిగా ఉచితంగా, లేక 90 శాతం సబ్సిడీతో రైతులకు విత్తనాలు అందిస్తారని ఆశలు పెట్టుకున్న రైతులకు 50 శాతం రాయితీ ప్రకటించడంతో ఆందోళన చెందుతున్నారు. కరవు మండలంగా ప్రకటించినా ప్రయోజనం లేదంటున్నారు.

విత్తనం ఉచితంగా ఇవ్వాలి



ఖాజీపేట మండలాన్ని కరవు ప్రాంతంగా ప్రకటించారు. అందువల్ల రైతులకు అందించే పచ్చిరొట్ట విత్తనం ఉచితంగా ఇవ్వాలి. దీంతో రైతులకు ఎంతో కొంత మేలు జరుగుతుంది. లేకపోతే కరవు మండలంగా ప్రకటించడంతో ఎలాంటి ప్రయోజనం లేకుండాపోతుంది.

\- మురళీమోహన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్

రైతులకు అవసరమైనంతా ఇవ్వాలి



ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైనంత పచ్చిరొట్ట విత్తనం ఇవ్వాలి. అధికారులు మంజూరుచేసిన విత్తన నిల్వలు ఎంతకీ సరిపోవు. రైతుల అవసరాలను గుర్తించి తగినంత విత్తనం రైతులకు సకాలంలో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

\- పీవీ.రాఘవరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి

కరవు ప్రాంతంగా ప్రకటించినా చర్యలు లేవు



కరువు మండలంగా ప్రకటించినా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. రైతులకు అందించే పచ్చిరొట్టె విత్తనం ఉచితంగా ఇవ్వాలి. ప్రభుత్వం తాజాగా 50 శాతం రాయితీపై అందిస్తామని చెబుతోంది. దీంతో రైతులకు కల్గే ప్రయోజనం ఏమిటో తెలియదు.

\- రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, కేసీ కెనాల్ ప్రాజెక్టు కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు

డాక్టర్స్ విభాగం జిల్లా కార్యదర్శిగా కల్యాణ చక్రవర్తి



కల్యాణ చక్రవర్తిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల : వైద్యవృత్తిపై సమగ్ర అవగాహన కలిగి ఉన్నందున ఆ రంగానికి చెందిన విభాగానికి పార్టీ జిల్లా కార్యదర్శిగా నియమించిందని, మీరు ఆ పదవికి న్యాయం చేసేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి గురువారం డాక్టర్ కళ్యాణ చక్రవర్తితో అన్నారు. పట్టణంలో ప్రముఖ వైద్యుడు, పార్టీ నాయకుడు డాక్టర్ కళ్యాణచక్రవర్తిని డాక్టర్ల విభాగానికి జిల్లా కార్యదర్శిగా నియమించడం జరిగింది. స్థానిక పార్టీ కార్యాలయంలో డాక్టర్ కళ్యాణ చక్రవర్తి ఎమ్మెల్సీని సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ రాళ్లపల్లె నరసింహులు, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు రాజీవ్‌బాషా, వైస్ ఎంపీపీలు సీఎం బాషా, చెన్ను రాజశేఖర్, జిల్లా మేధావుల ఫోరం మెంబర్ రవిచంద్రారెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు సాయి నారాయణరెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మా బడి మాకు ముద్దు

అట్లూరు : మాకు మోడల్ స్కూల్ వద్దు మా ఊరు బడి మాకు ముద్దు అంటూ విద్యార్థులతో పాటు వారి తల్లితండ్రులు చెన్నేపల్లి కాలనీలో గురువారం ఆందోళన చేపట్టారు. కూటమి ప్రభుత్వం పంచాయతీకి ఒక మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా చెన్నేపల్లె ప్రాథమిక పాఠశాలలో చదివే 3, 4, 5, తరగతుల విద్యార్థులను మోడల్ స్కూల్‌కు పంపాలని ఉపాధ్యాయులు తెలిపారు. దీంతో చెన్నేపల్లి పాఠశాల ముందు వారు విద్యార్థులతో ఆందోళన చేపట్టారు. దీంతో ఉపాధ్యాయులు ఏమీ చేయలేని స్థితిలో ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటులో అధికారుల నిర్లక్ష్యం

కలసపాడు : ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటులో అధికారులు నిర్లక్ష్యం చేయడంతో రైతు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. మండలంలోని చింతలపల్లె గ్రామానికి చెందిన రైతు సాదనకారి మురళీమోహన్ గత సంవత్సరం ఆగస్టు 2న విద్యుత్ అధికారులకు ట్రాన్స్‌ఫార్మర్ కోసం డీడీ చెల్లించాడు. అయితే ఇంత వరకు రైతుకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తనకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటులో అధికారులు జాప్యం చేయడంతో పంటలను ఎలా సాగు చేసుకోవాలని, అధికారులు ఇప్పటికైనా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో విద్యుత్ కార్యాలయం ముందు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటానని తెలిపారు.



ట్రాన్స్‌ఫార్మర్ కోసం గత ఏడాది ఆగస్టు 2న రైతు తీసిన డీడీ

వృద్ధులకు పండ్లు పంపిణీ

చాపాడు : స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద గల కాశినాయన ఆశ్రమంలో వృద్ధులకు గురువారం పండ్లు పంపిణీ చేశారు. రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా మైదుకూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ చాపాటి రామసుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో వృద్ధుల మధ్య కేక్ కోసి పంపిణీ చేశారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

బద్వేలు అర్బన్ : సీజనల్ వ్యాధులు, కీటకజనిత వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ వి.జనార్దన్‌రావు తెలిపారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జె.వినయ్‌కుమార్ ఆదేశాల మేరకు గురువారం పీహెచ్‌సీ పరిధిలోని వనంపుల సచివాలయం నందిపల్లెలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. దోమలను లార్వాదశలోనే గుర్తించి యాంటీలార్వా విధానాలను పాటించడం ద్వారా దోమల వృద్ధిని నియంత్రించవచ్చన్నారు. సీహెచ్‌ఓ జ్యోష్న, ఏఎన్‌ఎం రమాదేవి, దీపిక పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి



ఎంఈఓ పద్మలతకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మైదుకూరు : విద్యా శాఖ నిబంధనలను పాటించని మైదుకూరు సెయింట్ జోసెఫ్ ఇంగ్లీషు మీడియం స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మైదుకూరు ఎంఈఓ-1 పద్మలతను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీఆర్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయరాజ్, పీపీ స్వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఓబులేసు, ఎండీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ సెయింట్ జోసెఫ్ పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా నోట్ పుస్తకాలు, యూనిఫాం, బెల్ట్, షూ, తదితర విద్యా సామాగ్రి అధిక ధరలకు విక్రయిస్తూ తల్లిదండ్రులను దోచుకుంటున్నారని ఆరోపించారు. పట్టణంలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు అధిక ఫీజులు రాబడుతూ, కనీస సదుపాయాలు కల్పించడం లేదన్నారు. ప్రతి పాఠశాలల్లో నోటీస్ బోర్డులో ఫీజుల వివరాలున్న బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి, యువజన సంఘాల నాయకులు బయన్న, ప్రవీణ్, కన్నా, చంద్ర పాల్గొన్నారు.

రేపు ఉచితంగా మొక్కల పంపిణీ

ప్రొద్దుటూరు : శ్రీరవీంద్ర విద్యాసంస్థలు ఆవరణలో ఈనెల 21న ఉదయం 10 గంటలకు వృక్షో రక్షతి రక్షితః సేవా ప్రాజెక్టులో భాగంగా మొక్కలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు శివదర్శనానంద స్పిరిచ్యువల్ ట్రస్టు నిర్వాహకురాలు శివదర్శనానంద సరస్వతీ మాతాజీ ఒక ప్రకటనలో తెలిపారు.

5 వేల మందితో యోగా కార్యక్రమం



మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రమోహన్

బద్వేలు అర్బన్ : అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఈనెల 21న స్థానిక ఎస్.బి.వి.ఆర్ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించే యోగా కార్యక్రమాన్ని 5 వేల మందితో నిర్వహించనున్నట్లు ఆర్డీవో ఎ.చంద్రమోహన్ తెలిపారు. గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శారీరక, మానసిక ఆరోగ్య రుగ్మతలను అధిగమించేందుకు సులభతరమైన ఆరోగ్య సూత్రం యోగా ఒక్కటేనని ఇందుకోసం ఈ నెల 21న యోగాంధ్ర-2025 కార్యక్రమంలో భాగంగా 5 వేల మందితో యోగా కార్యక్రమం నిర్వహించనున్నామని, ఇప్పటికే కార్యక్రమానికి సంబంధించి ఆయా శాఖల అధికారులు, ప్రైవేటు కళాశాలలు, పాఠశాలల యాజమాన్యంతో సమీక్షా సమావేశం కూడా నిర్వహించామని తెలిపారు. 21వ తేదీ శనివారం ఉదయం 6.30 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో చిన్న, పెద్ద తేడా లేకుండా పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని యోగాంధ్ర కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

నేడు రెవెన్యూ డే

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు శుక్రవారం డివిజన్ పరిధిలోని అన్ని మండలాల తహసీల్దారు కార్యాలయాలలో రెవెన్యూ డే నిర్వహించనున్నట్లు ఆర్డీవో చంద్రమోహన్ తెలిపారు. ఇందులో భాగంగా ఆయా తహసీల్దారు కార్యాలయాల ఆవరణలో రెవెన్యూశాఖ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలు, అడంగల్, ఆర్ఎస్ఆర్, 1బి వంటి వాటిపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో బద్వేలు, గోపవరం తహసీల్దార్లు ఉదయభాస్కర్‌రాజు, త్రిభువన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్ఎస్‌సీ బోర్డు అధికారుల నిర్లక్ష్యంతో అన్యాయం

ప్రొద్దుటూరు కల్చరల్ : ఎస్ఎస్‌సీ బోర్డు అధికారుల నిర్లక్ష్యంతో తన కూతురు గురు భవానికి అన్యాయం జరిగిందని ఎన్.రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన కూతురు గురు భవాని, నారాయణ హైస్కూల్‌లో పదో తరగతి చదివిందన్నారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అన్ని సబ్జెక్టులకు కలిపి 561 మార్కులు వచ్చాయన్నారు. ఒక్కొక్క సబ్జెక్టులో 95 మార్కులకు పైగా రాగా సైన్స్‌లో 84 మార్కులు మాత్రమే వచ్చాయని తెలిపారు. దీంతో రీ వెరిఫికేషన్ దరఖాస్తు చేసుకోగా సైన్స్ పేపర్-2లో 36 మార్కులు వచ్చాయన్నారు. పీడీఎఫ్ కాపీని పరిశీలించగా సమాధాన పత్రంలో 17 బీ 12 మార్కుల ప్రశ్నకు సమాధానం రాసినా పరిగణలోకి తీసుకోలేదని, దానికి మార్కులు వేయలేదన్నారు. రీ వెరిఫికేషన్‌లోనూ అధికారులు జవాబును పరిశీలించలేదన్నారు. ఈ విషయంపై ఎస్ఎస్‌సీ బోర్డు అధికారులకు మెయిల్, లేఖ రాసినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. మంగళగిరిలోని ఎస్ఎస్‌సీ బోర్డు కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేసినా ఫలితం లేదని వాపోయారు. పరిశీలించని సమాధానికి 10 లేదా 11 మార్కులు వచ్చే అవకాశం ఉందని, దీంతో తన కుమార్తెకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబు నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకుని తన కుమార్తెకు న్యాయం చేయాలని కోరారు.

యోగా చేయండి.. ఆరోగ్యంగా ఉండండి

ప్రొద్దుటూరు రూరల్ : యోగా చేయండి.. ఆరోగ్యంగా జీవించండని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హనీఫ్‌బాబా పేర్కొన్నారు. మండలంలోని చౌడూరు సచివాలయం పరిధిలోని కాకిరేని పల్లెలో గురువారం ప్రజలకు యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ బీపీ వరప్రసాద్, ఆప్తమాలిక్ ఆఫీసర్ తేజ, సీహెచ్‌ఓ గౌతమి, ఏఎన్ఎంలు గోవిందమ్మ, వేదవతి, ఆశాకార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం యోగాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు విద్యార్థులకు యోగా ప్రాముఖ్యత తెలుపుతూ ఆసనాలు వేయించారు.

మహాసభలను జయప్రదం చేయండి

ప్రొద్దుటూరు : మండలంలోని పెన్నానగర్ సీపీఐ కార్యాలయంలో ఈనెల 22, 23వ తేదీలలో నిర్వహించే సీపీఐ 22వ పట్టణ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి సుబ్బరాయుడు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మూడేళ్లకోసారి పట్టణ, జిల్లా, రాష్ట్ర, జాతీయ మహాసభలు నిర్వహించి గడిచిన మూడేళ్లలో ప్రజా సమస్యలపై జరిపిన పోరాటాలను చర్చించుకొని భవిష్యత్తు పోరాటాలకు నిర్ణయించుకునేందుకు సీపీఐ మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి ఒక్క పరిశ్రమను కూడా పాలకులు ఏర్పాటు చేయలేకపోయారంటే ఇంత కన్నా దౌర్భాగ్యం మరొకటి లేదన్నారు. సీపీఐ పట్టణ సమితి సభ్యులు గోపాలం రామకృష్ణ, వై.హరి, మచ్చా శ్రీను, ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి పీటర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వరద అన్నా హజారేనా?

- నాపై చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదు
- మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు అన్నా హజారేలా ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఇతరులను విమర్శిస్తూ తాను అవినీతికి పాల్పడలేదని చెప్పుకుంటున్న మాటల్లో వాస్తవం లేదని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి కొట్టిపారేశారు. ఆయన గురువారం తన స్వగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నియమించిన అంగన్‌వాడీ ఉద్యోగాలు, సబ్‌స్టేషన్ ఆపరేటర్ల పోస్టులకు సంబంధించి తాను ఎవరి వద్ద డబ్బులు తీసుకోలేదని తెలిపారు. టౌన్ బ్యాంకు పరిధిలో గతంలో వరదరాజులరెడ్డి ముగ్గురికి పోస్టులు వేశారని, తన హయాంలో వారిని కొనసాగించానని, ఎవరైనా డబ్బులు ఇచ్చారని నిరూపించాలని పేర్కొన్నారు. సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో ఏ ఒక్కరి ఆస్తినైనా రాయించుకుని ఉంటే సిట్ విచారణ జరిపి తనను జైలుకు పంపాలని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయినా ఎందుకు విచారణ చేయలేదన్నారు. సీఎంఆర్‌ఎఫ్ ఆరోపణలకు సంబంధించి నిర్భయంగా విచారణ చేయించుకోవచ్చన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు సంబంధించి తమ ప్రభుత్వంలో తనపై అనేక ఆరోపణలను చేశారని, ఇప్పుడు ఎందుకు వాటిని అరికట్టలేకపోతున్నారని ఎమ్మెల్యే వరదను రాచమల్లు ప్రశ్నించారు.

మా కుటుంబంలో జమిందార్లు ఉన్నారు

తమ కుటుంబం పూర్వం నుంచి జమిందార్ల కుటుంబమేనని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. 200 ఎకరాలతో మా అబ్బ భైరవ కొండారెడ్డి, 800 ఎకరాలతో ప్రొద్దుటూరులో తన తాత పాతకోట పుల్లారెడ్డి, బంగారు రెడ్డి, బాలమునిరెడ్డిలు జమిందార్లుగా ఉన్నారని గుర్తుచేశారు. తన కుటుంబంలో విజ్ఞాన వంతులు, భూ స్వాములు, మేధావులు, సాహితీ వేత్తలు ఉన్నారని తెలిపారు. ప్రొద్దుటూరులోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్, షాదీమంజిల్, మిట్టమడి ప్రాంతమంతా తమ తాతగారి ఆస్తిలోని భాగమేనన్నారు. ఆప్రాంతానికి చెందిన టీడీపీ నాయకుడు జయరామిరెడ్డిని అడిగి తెలుసుకోవాలని సూచించారు. ఈవీ సుధాకర్‌రెడ్డికి ఇవ్వాల్సిన రూ.70లక్షలు బాకీ ఇవ్వకుండానే కోర్టులో కేసు కొట్టేయించడంతో పాటు ఆయనపైనే దాడి చేసి బెదిరించి ఎన్నికల్లో ప్రచారం చేయించుకున్నారన్నారు. ఆయనే ఇప్పుడు వరదరాజులరెడ్డి నీతిపరుడు, కొండారెడ్డి సౌమ్యుడు అని చెప్పించుకునే టాలెంట్ వరదరాజులరెడ్డికి మాత్రమే ఉందన్నారు. కామిశెట్టి సుబ్బారావును అవినీతి పరుడని గతంలో విమర్శించడంతోపాటు మున్సిపల్ కాంప్లెక్స్‌కు పేరు పెట్టకుండా అడ్డుకున్న ఎమ్మెల్యే వరద ప్రస్తుతం ఆయన కుమారుడు కామిశెట్టి బాబును తమ వైపునకు తిప్పుకుని ఎన్నికల్లో ప్రచారం చేయించుకున్నారన్నారు. వెయ్యి జన్మలెత్తినా తాను అవినీతి పరుడినని నిరూపించలేరని రాచమల్లు స్పష్టం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఎంపీపీ శేఖర్ యాదవ్, కౌన్సిలర్లు గుర్రం లావణ్య, చింపిరి అనిల్ కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు జంగమయ్య, చౌడం రవిచంద్ర, వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందాలి



మాట్లాడుతున్న ఎంపీపీ నిర్మలాదేవి

కలసపాడు : ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎంపీపీ బి.నిర్మలాదేవి తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నుపల్లె సర్పంచ్ నవీన్‌కుమార్, లింగారెడ్డిపల్లె ఎంపీటీసీ రమేష్‌కుమార్ మాట్లాడుతూ అధికారులు కేవలం కూటమి నాయకులకే పనిచేస్తున్నారని, మండలంలో భూ సమస్యలు ఉన్నా రెవెన్యూ అధికారులు పట్టీపట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఉపాధి హామీ పనులకు వెళ్లాలంటే టీడీపీ సభ్యత్వం ఉంటేనే పనికి రావాలని అంటున్నారని తెలిపారు. వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహబూబ్ బీ, రాజుపాళెం సర్పంచ్ సుధ రామకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు దేవీ భాస్కర్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు పౌష్టికాహారం



పుస్తకాలు అందజేస్తున్న సీడీపీఓ

చాపాడు : అంగన్వాడీ కేంద్రాలలో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం ఇస్తారని ఐసీడీఎస్ సీడీపీఓ సయ్యద్ ముంతాజ్‌బేగం అన్నారు. స్థానిక ప్రాజెక్టు కార్యాలయంలో గురువారం అంగన్వాడీ వర్కర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందించిన పీపీ1, పీపీ2 తరగతుల పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ రోజూ అంగన్వాడీ కేంద్రాలను సకాలంలో నిర్వహించాలని, క్రమం తప్పకుండా గర్భిణులు, బాలింతకలకు పోషకాహారం అందించాలన్నారు. అంగన్వాడీ కేంద్రం నుంచి పాఠశాలకు వెళ్లే పిల్లలకు చదువుపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సుబ్బరత్నమ్మ, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బండలాగుడు పోటీలు



విజేత ఎద్దుల యజమానులకు నగదు అందజేస్తున్న అతిథులు

చాపాడు : మండలంలోని బద్రిపల్లె గ్రామంలో దిగంబర వీరయ్య స్వామి ఆరాధన వేడుక ఘనంగా నిర్వహించారు. వీరయ్యస్వామి మందిరంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన బండలాగుడు పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ పోటీలలో బాపట్ల జిల్లా సంతమాగులూరు చెందిన వజ్రాల తేజస్వీరెడ్డి ఎద్దులు 4309.4 అడుగులు బండ లాగి ప్రథమ, గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం పెద్దగుట్టిపాడుకు చెందిన గరికపాటి లక్ష్మయ్య ఎద్దులు 4250 అడుగులు లాగి ద్వితీయ, ఖాజీపేట మండలం రహమత్‌ఖాన్‌పల్లెకు చెందిన ఇరగంరెడ్డి లక్ష్మిరెడ్డి ఎద్దులు 4237 అడుగులతో తృతీయ స్థానంలో నిలిచాయి. విజేత ఎద్దుల యజమానులకు వరుసగా రూ.60 వేలు, రూ.50వేలు, రూ.40వేలు చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమంలో గుత్తి వీరనారాయణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. హాజరైన ప్రజలకు అన్నదానం చేశారు.

సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ రమణారెడ్డి

మైదుకూరు : విద్యార్థినులు సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలని అర్బన్ సీఐ కేవీ రమణారెడ్డి అన్నారు. స్థానిక మేధా జూనియర్ కళాశాలలో సోషల్ మీడియాపై విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ రమణారెడ్డి మాట్లాడుతూ టెక్నాలజీ, సోషల్ మీడియాను అవసరమైనంత మేరకే ఉపయోగించాలని సూచించారు. సోషల్ మీడియాలో పరిచయమయ్యే వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులను పరిచయం చేసుకొని మోసపోరాదని అన్నారు.